సీతార

'గిరి'

౧

౧౭౩౮ క్రీ. శ.

సాయంత్రమైంది.

అక్కడే మకామున్నాడు నాదిర్షా. లక్షాయాభై వేల సైన్యం సింధునదిపొడుగూతా విడిసింది. అర్ధగంటలో గుడారాలన్నీ తయారయాయి. గుఱ్ఱాలని కట్టేసి మేత వేసారు. అప్పుడే వంటశాలల్లోంచి పొగ రాత్తోంది. నది చాలా విశాలమైపోయి సముద్రంమల్లే అవుపడేచోట సుల్తాన్ డేరాలు వేసారు. నాలుగు సుల్తాన్ సొంతం కోసం; ఐందాముప్పై ఆయనస్త్రీలకోసం. అహమద్షా, అక్బరలీ మొదలైన సుల్తాన్ ఆంతరంగికమంత్రుల పదకొండుడేరాలు ఆయనడేరాకి యెడమవేపున కొంత దూరాన వేసారు. ఒకగంటకు పూర్వం అడవిజంతువులకి స్థావరంగా వుండిన సింధునదీతీరం మనుష్యావాసమైపోయింది. నాదిర్షా వేలిసంజ్ఞమీద నడిచిపోయే మహా పట్టణమది.

చైత్రమాసమైనా శాలువల్ని వొదల్నీటం లేదు చలి. వసంతమాసంతో వూగిపోతోన్న అక్కడి వనాలు, చల్లని పిల్లగాడ్పులు గంధర్వ క్రీడావిహారాలకి యోగ్యమైన కాశ్మీరదేశ వైభవాన్ని చవిచూపిస్తోన్నాయి. మామిడిగున్నలు చిగురుటాకుల లాలిత్యంతో తలమూగిపోతోన్నాయి. కోకిలలు తమ "కూఊ" ల మూలాన-హిందోళనరాగంలో మైమరపించే శక్తి వుండటం నిజమేనంటున్నాయి.

ఐదుగడియల రాత్రైంది. దినమంతా ప్రయాణ భారంచేత డస్సిపోయిన సైనికులంతా విశ్రాంతి గొంటూన్నారు. అక్కడక్కడ కొందరు యువకులు సారాయి త్రాగుతూ నెగళ్ల వెలుగులో 'ఖాబాష్' ఆడుతన్నారు. గుఱ్ఱాలప్పుడప్పుడు సకిలిస్తోన్నాయి. సుల్తాన్ డేరాలో బంగారుముక్కాలుపీటమీద లాంతరొకటి పెద్దకాంతితో వెలుగుతోంది. సుంద్రనిదిండ్లమర్చబడ్డ సన్నని పరుపుమీద, అక్బరలీ మరియాదగా కూచొని వినయంగా మాట్లాడ్తోన్నాడు సుల్తాన్తో. రెండుపరుపులమీద పరువబడ్డ ముహమల్ పరుపులో మెత్తనిపట్టుగౌసెన్ల దిండ్లమధ్య వంకరగా వొరిగి కూచొని హుక్కా పీలుస్తోన్నాడు సుల్తాన్. పర్షియా దేశాన్ని ఆక్రమించుకున్న రష్యాదేశీయుల్ని తరిమేసేప్పుడు లభించిన అందకత్తెలందరికన్నా అధికురాలైనామె సుల్తాన్ వెనక కూచొని పంకా విసర్తోంది. అఫ్ఘానిస్థానపురాజు తన వినయవిధేయతలని వ్యక్తపఱచడానికి కానుకగా సమర్పించిన సౌందర్యరాశి సుల్తాన్కు కుడిభాగాన కొంతదూరాన కూచొని తాంబూలంమడుస్తో తనసౌందర్యమంతా కదలిపోగా ఆయన కందిస్తోంది. పర్షియాదేశం సొంతం తన స్వాధీనం అయాక ఆ దేశాన్నంతా కొల్లగొట్టించాడు, ప్రపంచంలో అందరికన్నా సౌందర్యవతియైన యువతి కావాలని. లభించింది షిరాజీ. ఆషిరాజి ఆయనకి దగ్గిరగా యెడమచేతిక్రింద వుండి హుక్కాగొట్టాన్ని అందిస్తోంది. ముట్టితే మాసి, వాసన చూస్తే వాడిపోయే ఆమె నాజూకుదేహాన్ని ఫిరంగి గుండ్లకుకూడా వెరువని తనవక్షంమీద వొంచుకొన్నాడు. ఆయనయెడమచేతివేళ్లు ఆమె వెంట్రుకల్తోతిగి గుండ్రని భుజాల్తో, ఆడుకుంటోన్నాయి అతనికి తెలీయకుండానే. అక్బరలీకి తనుచూసే దృశ్యమేమీ అర్థమవడంలేదు, విద్యాగంధం లేనివాళ్లు తాము తిట్టుకునే తిట్లకి అర్థం తెలిసికోనట్టు.

"అతడు సంధి కోరాడని చెప్పి యింతదూరం వొచ్చాక వూరికే తిరిగిపోవటం వుచితం కాదు. అదీ కాక యిక్కణ్ణుంచే మనం వెళ్లిపోయామంటే నేను భయపడి వెళ్లిపోయానని తనప్రజల్తో చెప్పడానిగ్గూడా వెనక్కితీయడు."

జవాబేమీ చెప్పకుండా నేలవేపు చూస్తో ఆలోచిస్తోన్నాడు అక్బరలీ. సర్వసంగపరిత్యాగం

గావించిన తాపసికి తనజీవితమంతా తపస్సునందు ధారబోయటంలోనే వుంది బ్రహ్మానందం. సకలేచ్ఛల్లో కామేచ్ఛే అధికంగావుండే నరూధినికి ప్రవరాఖ్యుడిలాంటి యిష్టపురుషుడితో సౌఖ్య మొందటంలో వుంది బ్రహ్మానందం. కాని ఉత్తమక్షత్రియుడి కా బ్రహ్మానందం వైరికిరీటాన్ని తనకాలితో తన్నటంలో దప్ప వేరేచోట లేదు. నాదిర్షా యిప్పు డనుభవించే బ్రహ్మానందంలో శత్రువుపై పగ సాధించాకదా అనే సంతోషంకూడా ఐక్యమైంది. అందుచేతే ఆతని విశాల నేత్రాలు మెరిసిపోతోన్నాయి. ఒకప్పుడు తనని పరిహసించిన ఢిల్లీసార్వభౌము డిప్పుడు తనపాదాలదగ్గిర శరణార్థి పడున్నాడు. కాని సుల్తాను కిప్పు డొక గొప్పవిషమస్థితి సంభవించింది. ఢిల్లీపైబడి శృంగారమైన ఆపట్టణాన్ని సర్వధ్వంసంచేసి పగతీర్చుకోడాని కాతనిఅంతరాత్మ వొప్పదు. శరణుజొచ్చినవాడిపై దండెత్తడం చచ్చినపాముని బాదటం. అట్లాకాక యిక్కడినుంచే తిరిగిపోతే ఆమొగల్ రాజు తనని పరిహసించినందుకు పగతీర్చుకోటం యెట్లా? అక్బరలీకికూడా యేమీ తోచడం లేదు. సుల్తాన్ తీవ్రంగా ఆలోచిస్తోన్నాడు. చప్పున ఆయన కేదో ఆలోచన తట్టింది.

"ఢిల్లీ కెళ్లాలి."

"వెళ్లి?"

"ఢిల్లీప్రజలందరిముందు మొగల్ సింహాసనాన్ని మూడురోజులధిష్ఠించి తిరిగి రాజ్యాన్ని మొగల్ రాజు కిచ్చేసి మన దేశం వెళ్లి పోవటం. దీనివల్ల ఆతనికి పరాభవం కలిగించినవాళ్లమవుతాంకూడా."

"ఆయన వొప్పకుంటే?"

"యుద్ధం."

౨

డేరాముహమల్ పరదా పక్కకి తొలిగింది. ఆయుధపాణియైన ఆగాబాషీ వంగి సలాంచేసి నుంచున్నాడు.

'ఏమి' అన్నట్టు ఆతనివేపు చూసాడు సుల్తాన్.

"ఢిల్లీ చక్రవర్తి తమకు కానుక బంపారు."

"ఏమేమిటి?"

"ఒకమణుగు ముత్యాలు, ఐదేనుగులు, యిరవై గుఱ్ఱాలు, పదిమంది సుందర యువతులు."

"చీకటైపోయింది. ఏనుగల్ని గుఱ్ఱాల్ని పొద్దున చూడొచ్చు. తక్కినవాట్ని చూడ్డానికొస్తోన్నా నిప్పుడే, సిద్ధంగా వుంచు"

ఆగాబాషీ వంగి సలాంచేసి వెళ్లిపోయాడు. ఆహారసీకి కన్యను తవపక్షంమీాదనుంచి లేపి తనుకూడా లేచాడు సుల్తాన్. అక్బరలీకూడ లేచాడు. మాట్లాడకుండా యిద్దరూ బైటికెళ్లారు.

పక్కడేరాలోకి సుల్తాన్ అక్బరలీతోగూడా వొచ్చేవరకు ఆపదిమందిబురకాస్త్రీలను వరుసగా నుంచోబెట్టాడు ఆగాబాషీ. అక్బరలీ, ఆగాబాషీ దూరంగా నుంచున్నారు. సుల్తాన్ మొదటామెదగ్గిరికొచ్చి బురకా తివ్వమన్నాడు. విధి లేక మెల్లిగా తొలగించి తల కిందికివాల్చి నుంచుంది. ఆబురకాని పూర్తిగా యీడ్చేసి కాలినుంచి తలదాకా చూసాడు యోగాదిగా. ముఖాన్ని పైకెత్తి దీపంవెలుగులో చూసాడు. నిపుణుడైన శిల్పిచేత చెక్కబడ్డ దంతపుబొమ్మలాగుంది. వరుసగా తక్కినవాళ్లందర్ని యిట్లానే పరిశీలించాడు. ఒకాళ్లకన్న ఒకా రెక్కువసుందరంగా వున్నారు. వాళ్లంతచెడ్డగా లేరన్నట్టు ఆకళ్లనుంచీ, మెరిసిపోయే ఆనల్లనిగడ్డంమధ్య యెఱ్ఱగా కదిలే ఆపెదిమలనుంచీ తృప్తి వ్యక్తమవుతోంది. ఆ యువతుల్ని తనయిష్టమొచ్చినట్టు పరిశీలిస్తోన్నాడు, గుఱ్ఱములకు లక్షణాలని పరీక్షించినట్టు. అవసర మనుకున్న ప్రదేశాల్లో యేమాత్రం జంకకుండాగుడ్డని తొలగించి చేతితో తాకి చూస్తోన్నాడు. పంతొమ్మిదేళ్ల అరబుయువతో కామెనిగురించి అనుమాన మేదో కలిగితే అక్బరలీని వెళ్లిపొమ్మని ఆమెగుడ్డలన్నీ విడిపించి లాంతరు దగ్గిరకి తెచ్చి వెలుగులో ఆమెదేహాన్నంతా పరీక్షించాడామె కంటినుండి కారే ఆనీళ్ల నేమాత్రం లెక్కచేయకుండానే.

చివరకి పొడుగ్గా నుంచున్న యువతి దగ్గరికొచ్చి సహజమైన కంఠస్వరంతో బురకా తియ్యమన్నాడు. తియ్యలా. మళ్లీ ఆజ్ఞాపించాడు. అయినా తియ్యలా. ఉగ్రుడయ్యాడు. నాదిర్షా ఆజ్ఞ అమల్ గావటాని కాలస్యమే. తనే యీడ్చిపారేశాడు బురకాని. ఆమె తల కిందికి వాలలేదు. పైకెగరేసి గర్వంగా, ధైర్యంగా నుంచుంది. ఎత్తైన ఆ ముఖంలో ఎదురుబడేస్వభావం స్పష్టంగా తాండవమాడుతోంది. ఇంచుమించు సుల్తానెత్తుందామె. ఆతని చూపులు క్రమంగా మెరిసిపోయే ఆమెదేహపు ఉన్నతప్రదేశాలపైనుండి జారుతోన్నాయి. ఒక్క చూపులో అసాధారణమైన ఆమెఅంగసౌందర్యం యవ్వనం ఆతని కాశ్చర్యం కలిగించాయి. ఒళ్లు ములక లెత్తింది. మళ్లీ పైకి చూసాడు. స్త్రీలలలిత దేహాకృతిని సరవిచెట్లకు బోల్చి వాళ్ల కంఠమాధుర్యాన్ని 'బుల్ బుల్' స్వరాల కనువర్తించే తనదర్బార్లోని కవుల స్త్రీ వర్ణనంతా అసంతృప్తికరంగానే తోచిందాతని కా ముహూర్తాన. చూపు సైతం జారిపోయే ఆమెనున్నని రెట్టని పట్టుకోపోయాడు. ఆమె తనకుడిచేత్తో

" రెట్టపట్టుకో|పోయాడు......సుల్తాన్ పై లేపింది. "

బోడ్లోంచి మెరిసిపోయే చిన్నకత్తి నూడబెరికి సుల్తాన్ పై లేపింది. ఆగాబాషీ పెద్దగా అరిచి ముందుకు పరుగెత్తాడు. పచ్చని చెట్టుని సైతం బూడిదచేసి కూల్చే ఆతీక్ష్ణమయినచూపులు ఆమెకళ్లలోకి గురిపెట్టాడు సుల్తాన్. ఆమె అట్లాగే ఆగింది. తనచెయ్యి ముందుకు జాచి, "ఇటివ్వు" అన్నాడు. ఎత్తిన ఆమెచెయ్యి వణికింది. "ఇవ్వు" అన్నాడు, గట్టిగా పళ్లుబిగబట్టి. సాధారణ గర్భిణీస్త్రీ దగ్గిర గనక వుంటే ఆవొక్క శబ్దానికే గర్భపాతం గావాలిసింది. ఆకత్తి నట్లే ఆచేతిలో పడేసితల కిందికివాల్చి నుంచుంది. రెండు నీటిచుక్కలు చెంపలమీదుగా జారుంటాయి. కాని అవుపడనీలేదు. ఆకత్తిని తననడుంకట్టులో వుంచుకొని వొక్కసారి మళ్లీ కిందినుంచి పైకి చూసాడు. ఆగాబాషీవేపు తిరిగి మెల్లిగా నడుస్తో "ఎవరీమె?"

"మొగల్ మహారాణిదగ్గిరి ఆంతరంగిక స్త్రీ. రాజపుత్రకన్య. సితార."

సుల్తాన్ వెళ్లిపోయాడు.

3

తనడేగాలో సుల్తాన్ ఢిల్లీప్రయాణాన్ని గురించి ఆలోచిస్తో యిటూఅటూ పచారుచేస్తోన్నాడు. ఇతరులెవరూ లేరు. దాసివొకర్తె వచ్చి సలాంచేసి, "ఈ రాత్రి యేడేరాలో పడుకుంటారు" అని అడిగింది. ఆలోచించాడు. తాత్కాలికంగా తనవెంటున్న వందాముప్పైమంది సందర్ని తలుచుకున్నాడు. లక్ష[illegible]ద్రవ్యం వ్యయపరిచి దొంగతనంగా పట్టితెప్పించిన ఆంగ్ల సుందరి జ్ఞాపక మొచ్చింది. ఆమెదగ్గిరికి పోవా లనుకున్నాడు. కాని తక్షణమే వొద్దనిపించింది. "ఇక్కడే పడుకుంటా" నన్నాడు. దాసి వెళ్లింది. ఆవలింత లొచ్చాయాయనకి. దుస్తులువిప్పుతోంటే నడుంపట్టాలోంచి చిన్నకత్తి కిందపడ్డది. ఎత్తి చూసాడు. వజ్రాలు చెక్కున్నాయి దానికి. మళ్లీ సితారా జ్ఞాపక మొచ్చిందిల ఆకత్తిపిడివేపు చూస్తో ఆమెసాహసాన్ని, అందాన్ని తలుచుకున్నాడు రెండునిమిషాలు. దానొక్కమా

పడేసి "ఆగా" అన్నాడు. ఆగాబాషీ సలాం చేస్తూ హాజరయ్యాడు. "సితారాని తీసుకోరా."

రెండునిమిషాల్లో పరదా తొలిగి తల కిందికి వాల్చుకున్న సితార, వెనకాల ఆగాబాషీ ప్రత్యక్షమయారు. సుల్తాన్ చూపులఅర్థం తెలిసికొని పరదా జారవిడుస్తూ వెళ్లిపోయా డాగాబాషీ. అట్లాగే నుంచున్నామెదగ్గిరికి సుల్తాన్ మెల్లిగావెళ్లి ముందు దగ్గరగా నుంచున్నాడు. ఆమెచేతిని పట్టుకోపోతే తనబలం కొద్ది చేతిని ఝాడించింది విడిపించుకోవాలని. ఇంకో చేతినిగూడా పట్టుకున్నాడు. పైకెగరేసినముఖం వేపు చూసాడు. పళ్లు బిగబట్టింది. కాని కళ్లల్లో నీళ్లు గమ్మాయి.

"ఎదురు తిరగటమే!"

"వొంటరిదాన్ని. లేకపోతే......!"

గట్టిగా నవ్వాడు ఎఱ్ఱని పెదిమల సంధినుంచి తెల్లనిపళ్ల జత అవుపడేట్టు. నిజమైన సంతోష మది. వణుకుతోన్న ఆమె క్రిందిపెదవి ఆయనహృదయాన్ని కదిల్చేసింది. దాని ఆస్వాదనానికి ఆశపడ్డాడు. ఆమె రెండుచేతుల్ని తన నడుంవెనక్కి లాగి ఆమెని తన మీదికి లాక్కున్నాడు. ఉడికిపాయ్యే ఆమెమెత్తని దేహం ఆయన విశాలవక్షాన్ని ఆనుకుంది.

* * * *

తెల్లారకముందే లేచి గుఱ్ఱాలకవాతుకోసం వెళ్లిపోయాడు సుల్తాన్. జాంపొద్దెక్కాక పరిచారిక స్త్రీలొచ్చారు డేరాలోకి. అట్లాగే పడుంది పరుపులో సితార వొంటిమీ దేమాత్రం స్పృహ లేకుండా. చీరా, రవికా చినిగి యెక్కడెక్కడో పడున్నాయి. జుట్టంతా చెదిరిపోయి చిక్కుపడ్డది. కళ్లరెప్పలు బాగా ఎఱ్ఱగా వాచిపోయాయి. మెళ్లోని పేర్లు పెరిగిపోయాయి. నలిపేయబడ్డ గులాబిపువ్వు.

దాసీ లామెకి గుడ్డకట్టించి, పాలుతాగించి, పడుకోపెట్టి వెళ్లిపోయారు. మధ్యాహ్నంతరువాత మేలుకొచ్చింది. కళ్లువిప్పి చూసింది. ఆరునెల్లనుంచి అవస్థపడుతోన్న రోగిమల్లే మెల్లిగా లేచి దిండుకి వొరిగి కూచుంది. ఎక్కడున్నానా అని చుట్టూ చూసింది. ఒకనిమిషంతరువాత ఆడేరా, ఆపరుపు, ఆసుల్తాన్ గవును, తన చినిగిపడున్న రవికా అన్నీ అర్థమయాయి. కళ్లుమూసుకొని పెద్దకేకవేసింది. పరదాలోంచి ఆగాబాషీ ఆమెకు తెలీకుండా తొంగిచూసాడు మళ్లీ కళ్లువిప్పింది. తనదేహంవేపు చూసుకుంది, గుడ్డలు తొలిగించి. దుఃఖ మాగిందికాదు. ఆదేహాన్నంతా కత్తితో ముక్కలుముక్కలుగా నరికిపారేయాలన్నంత అసహ్యమేసింది. అంతా ఎంగిలి. అంతా హుక్కావాసన. అంతా ఆగడ్డం గుచ్చుకున్న చోటే. కాలిగోరునుంచి తలవెంట్రుకల్దాక ఎంగిలికానిచోటు కూసింతగింజంతైనా లేదు. ఈయిరవైనాలుగేళ్లనుంచి యింతజాగ్రతగా యీ దేహాన్ని పెంచిం దిందుకోసమేనా? ఈదేహానికోసం ఆశపడి తమరాజ్యాలనిసైతం ధారవోయడానికి సిద్ధంగావున్నవాళ్లని ముట్టుకోసైతం ముట్టుకోనకుండా కాపాడింది యిట్లా యీక్రూరుడిచేతులలో కొల్పోడానికేనా? కళ్లనీళ్లు మెత్తల్ని తడిపేశాయి. వొళ్లంతా గిచ్చుకుంది. లేచి నుంచోపోయింది. కాళ్లు వొణికాయి. దేహం వొణికింది. అర్థంకాని నీరసం. మళ్లీ పడిపోయింది. రెండుచేతులా కళ్లుమూసుకొని యేడుస్తోంది. ఆరాత్రివిషయా లెన్నో జ్ఞాపకమొస్తోన్నాయి ఒకాటితరువా తొకటి. ఆతని మొండిపట్టుదల! ఉద్రేకం! బలం! ఎంతకూ తృప్తికానికామం!

ఇద్దరుపరిచారకస్త్రీలు రెండుబంగారుపళ్లెరాల్లో తిండిపదార్థాలని తెచ్చి సితార వున్నదికూడా తెలీనట్టు ఆమెవైపు చూడకుండానే పరుపుదగ్గిరపెట్టి వెళ్లిపోతోన్నారు. పట్టరానికోప మొచ్చిం దామెకి. ఆరెండుపళ్లెరాలని వాళ్లతలలపై విసిరింది. అయినా వాళ్లు మాట్లాడేదు. కోపంగా తిరిగిచూసి వెళ్లిపోయారు. సాయంత్రందాకా యెవరూ అవుపళ్లా. మెల్లిగా లేచి డేరాతోవవేపు నడిచింది. పరదా పన్నగా కదిలించేసరికి నల్లని సిద్దీవొకాడు చేతితో సంజ్ఞచేస్తూ, "అదితప్పు, లోపలికెళ్లండి" అన్నాడు. రాత్రికి మళ్లీ రెండు పళ్లెరా

లొచ్చాయి. కాని వాట్ని ముట్టుకోలా సితార. తెల్లారి మళ్లీ పళ్లెరాలొచ్చేవరకు ఆకలిచాత పేగులు మాడిపోతోన్నాయి. ఆవంటకాల్లోంచి వొచ్చేవాసన రెండు బుక్కలు తినడానికి పురికొల్పింది.

మూడు రోజులు గడిచాయి. మధ్యాహ్నం, సాయంత్రం తిండిపదార్థాలు తెచ్చేదాసీలు తప్ప వేరు మనుష్యాకారం అవుపళ్లేదు. రాత్రవడంతోటే సుల్తాన్ వొస్తాడేమో నని భయపడేది. కాని ఆయనకి జ్ఞాపకముంటేనా అసలు!

ఆవుదయాన యేమీతోచక డేరా కిటికీ దగ్గర నుంచుంది. ఆవలివే షాహసిద్దీ నుంచున్నాడు. దూరాన సైనికులసుం షాహటి వలయాకారంగా నుంచుంది. మధ్యో యొహాడు గోధుమరంగు గుఱ్ఱాన్ని పట్టుకోనుంచున్నాడు. ఒహరితరువా తొహ రొచ్చి దాన్ని యెక్కడానికి ప్రయత్నిస్తోన్నారు. కాని అది ఆకాశాన్ని అందుకోడానికేమోనన్నట్టు యెగుర్తో అందర్నీ పడేస్తోంది. సుల్తాన్ పక్కన నుంచోని అట్లా పడిపోయేవాళ్లని కోపంగా చూస్తోన్నాడు. చివరకి "ఆగా, నువ్వు" అన్నాడు సుల్తాన్. ఆగాబాషీ యెక్కాడు. గుఱ్ఱం యెగిరింది. రెండుకాళ్లమీద లేచి నుంచోడం ఆరంభించింది. అంకోడిలోంచి కాలుజారి పడిపోయాడాగా. సుల్తానాతన్ని వొక్కతన్ను తన్నాడు. బెత్తం తెమ్మన్నాడు. తెచ్చారు. తానే సొంతంగా యెక్కాడు గుఱ్ఱాన్ని సుల్తాన్. బెత్తం విఱిగేట్టు కొడుతోన్నాడు దాన్ని దెబ్బమీద దెబ్బ. గుఱ్ఱానికి వొళ్లంతా పగిలి నెత్తురు దుముకుతోంది. ఎన్నో సార్లు పడిపోయింది, కావాలని. కాని దాంతో కూడా మళ్లీ లేచాడు సుల్తాన్. ఎగిరియెగిరి అలిసిపోయింది. డేరాలచుట్టంతా పరుగెత్తింది. ఇంకా కొడ్తోన్నాడు. చివరకి నోట్లోంచి తెల్లనినురుగు రావటం మొదలెట్టింది; పడిపోయింది. మళ్లీ లేవలా. అప్పుడు వొదిలాడు దాన్ని సుల్తాన్. ఇదంతా చూసి పెద్దనిట్టూర్పు విడిచింది సితార. వొళ్లంతా చెమటలు కమ్మాయి. "సుల్తానుకి లొంగం లేదు!" అన్నాడు సిద్దీ.

౪

ఢిల్లీ చేరింది సైన్యం. ఢిల్లీప్రజ లెవర్నీ యేమనొద్దని ఆజ్ఞాపించాడు సుల్తాన్. కాని సైన్యం ఢిల్లీ చేరిన రెండుఝాముల్లోపలే సుల్తాన్ సైనికులు ఢిల్లీ స్త్రీలను బలవంతంగా చెరుస్తోన్నారనేవార్త బైల్దేరింది. ఢిల్లీప్రజలంతా సుల్తాన్ సైన్యంమీద తిరగబడ్డారు. చాలామందిని చంపారుకూడా. ఇదంతా మొగల్ చక్రవర్తి కుట్ర అనుకున్నాడు సుల్తాన్. యుద్ధానికాజ్ఞ అయింది. యుద్ధానికేమాత్రం సిద్ధంలేని ఢిల్లీప్రజలు కొన్నిఘడియల్లో చెల్లాచెదరైపోయారు. ఎంతో సుందరమైన మిద్దెలు, మేడలు తగులబెట్టబడ్డాయి. స్త్రీలూ పిల్లలూ యెందరో అగ్నిపాలయారు. చేతికి దొరికిన ద్రవ్యాన్నంతా అపహరించారు, సుల్తాన్ సైనికులు. చివరకి మొగల్ చక్రవర్తిని సైతం చెరబెట్టారు. రాణిని సుల్తాన్ స్త్రీలలో దాకల్ చేశారు. మూడు రోజు లిట్లానే వుంచాలన్నాడు సుల్తాన్, ఢిల్లీసింహాసనంమీద కూచోని.

సితారడేరాలోకి మామూలుప్రకారం భోజనం తెచ్చారు మధ్యాహ్నం. పళ్లెరాన్ని అక్కడ పెట్టి నలువేపులా చూసిం దా దాసి. తనబొడ్డులోంచొక చీటీ తీసి చప్పున సితారమీద పడేసి వెళ్లిపోయింది. ఏంఘోరం రాసాడో దాంట్లో నని భయపడ్డది. వొణికేచేతుల్తో విప్పిచూసింది. రాణి వుంగరం మొహరుంది. పాప మామెకేంతెలుసు సితార స్థితి! సితార సుల్తాన్మీద సర్వాధికారం చెలాయిస్తోం దనుకొం దామె. అందుకనే అట్లా రాసింది. ఇట్లా నిర్బంధింపబడి తన సౌందర్య యౌవనాలని బలవంతాన కోల్పోతోందని ఆమె కేంతెలుసు? సుల్తాన్ తనని అవమానపరచకుండా రక్షించమంది. ఢిల్లీరాణి సితారాని తన చిన్నిచెల్లెలిక న్నెక్కువ గారాబంగా పెంచింది. చక్రవర్తి దురుద్దేశాన్నుంచి యెన్నోసార్లు రక్షించింది, తానెన్నోకష్టాలపాలై. అట్లాంటి దయామతల్లికి సితార యేమిస్తే యేమవుతుంది! ఏవిధంగా ఆమె ఋణం తీర్చుకోగల్దు! తనని రక్షించమని రాసింది.

ఆమెమానాన్ని రక్షించడం చెరలో వున్న తనచాతనవుతుందా? అదీ సుల్తాన్నుండి రక్షించడం! తన్ను తాను రక్షించుకోలేకపోయింది, యితర్లని రక్షించగల్దా? మళ్లీ ఆరాత్రి అవస్థంతా జ్ఞాపక మొచ్చింది. వొళ్లు ఝల్లుమంది. చివర కోహ ఆలోచన తట్టింది. ఆప్రయత్నం కొనసాగుతుందని అణుమాత్రంకూడా ఆశలేదు. కాని ఆమార్గంతప్ప ఇంకోహటేదీ లేదు. కాని తనఆత్మగౌరవాన్ని త్యాగంచెయ్యాలి.తన మానప్రాణాల్ని యెన్నోసార్లు రక్షించిన ఆమహారాణిమానాన్ని కాపాడ్డానికి యేమైనా చేయాలి. లేకపోతే వీల్లేదుమరి.

పరదాదగ్గిరి కెళ్లి సిద్దీ కారాణివుత్తర మిచ్చి "దీన్ని జాగ్రతగా తీసికెళ్లి నేను పంపానని సుల్తాన్‌కివ్వాలి." అంది. సిద్దీ ఆశ్చర్యంతో చూసి సలాంచేసి మంచిదన్నాడు.

సితార భోంచేసి తాంబూలం చేతులోపట్టుకుంది వేసుకోవాలని. పరదా తొలిగించి సుల్తాన్ ప్రవేశించాడు. ఆమెముందు నవ్వుతోనుంచొని ఆమెచేతిలోని తాంబూలం లాక్కొని నోట్లో వేసుకున్నాడు. సితార పంపినవుత్తరం చూపిస్తో నుంచున్నాడు. ఆమె కా ప్రసన్నదృక్కులు అర్థం కాలా. ఏమీ భావంలేని చూపుల్తో యెదురుగా నుంచుంది.

"ఏమి టీవుత్తరం?"

ఆఉత్తరంవేపు చూసింది.

"నాకీభాష రాదు. ఏం రాసావో చెప్పు."

చిరునవ్వు తాండవమాడుతోం దాగడ్డంలో, కళ్లల్లో. ఈతరుణం పోగొట్టుకుంటే లాభం లేదు. ధైర్యం తెచ్చుకుంది. నేలవేపు చూస్తోనే, "అది నేను రాయలా. మీరు చెరబెట్టిన ఢిల్లీరాణి నాకు రాసింది తనని రక్షించమని."

"ఏమైందామెకి? సౌఖ్యంగానే వుందిగా."

సితారకి తెలుసు నిజంగా సుల్తాన్‌కి అర్థంకాలేదని. కాని రాణికోరే రక్షణేమిటో సిగ్గువిడిచి యెట్లా చెప్పగల్దాయన్తో? ఒక్కనిమిషం యిద్దరూ మాట్లాళ్లా. ఏమిటో తెలిసికోవాలని సుల్తాన్ ఆలోచించాడు కూడా. కాని లాభం లేకపోయింది. సితార చివరకి ధైర్యం చేసింది. రాణికోసం యేమైనా చేయగల్దు.

"స్త్రీలమానమంటే లెక్కలేనిమీనుండి రక్షించమని రాసింది."

అర్థమైంది సుల్తాన్‌కి. పట్టరానిసంతోషం మొచ్చింది. అమాంతం సితారాని కౌగలించుకొని ముద్దెట్టుకోవాలనిపించింది. కాని అణుచుకున్నాడాకోర్కని. సితారాని సంతోషంపెట్టడాని కేంజవాబు చెప్పాలో. ఆలోచిస్తోన్నాడు. వొచ్చేజవాబెట్లా పిడుగుమల్లే పడ్తోందో నని భయపడ్తోందిసితారఈరాణివాసీమీద నక్షీనిచూస్తో.

"ఏంచేయమంటావు మరి" అన్నాడు.

ఆశ్చర్యంతో పైకి చూసింది. ఇట్లాంటిజవాబొస్తోం దనుకోలా. ఆమొఖంలోంచి కరుణ, కరుణకన్న ఎక్కువమోహం వూడిపడుతోన్నాయి. "రక్షించాలి" అంది.

"నీదగ్గిరకి పంపనా?"

సంతోషాధిక్యంచాత ఆమెకంటినుండి నీటిచుక్కలు జారాయి. మళ్లీ పైకిచూసింది. ఆయనగ్గూడా తెలుసు,ఆమెకుసంతోషం కలిగిందని. మరీసంతోషంతో ఆమెకళ్లల్లోకి చూస్తో "ఇంకా యేమిటాజ్ఞ" అన్నాడు. ఆమె మాట్లాళ్లేదు. కాని ఆమెకీ తెలీకుండానే ఆమెకళ్లు కృతజ్ఞతని తెలిపాయి. అట్లా నుంచున్నామెని అమాంతం "అమ్మా" అనేట్టు కౌగలించుకొని పెదిమల్ని ముద్దుపెట్టుకొని చప్పున వెళ్లిపోయినాడు.

పది నిమిషాల్లో రాణీ, సితారా ఒహళ్లనొహరు కౌగలించుకొని యేడ్చారు.

రెండురోజులు గడిచాయి. సుల్తాన్ విషయమే తెలీదు సితారాకి.

ఆనాడు పొద్దున్నే ప్రజలందరిముందు ఢిల్లీరాజ్యాన్ని తిరిగి మొగల్ చక్రవర్తి కొప్పగించాడు సుల్తాన్. ఖైదీలందర్నీ వొదిలారు.మర్నాడు ప్రయాణం స్థిరపడ్డది.

ఆరాత్రి భోజనం తరువాత సుల్తానొచ్చాడు డేరాలోకి. సితార భయపడ్డది బాధిస్తాడేమో మోహం చేత అని. కాని ఆమెని ముట్టుకో సైతం ముట్టుకోలా; రాణివిషయంకూడా మాట్లాళ్లా. జ్ఞాపకమున్నట్టే లేదాయనకి. ఆమె మాట్లాడకున్నా ఢిల్లీ విషయాలెన్నో చెప్పాడామెతో తనే. చివరకి నిద్రపోయాడు. సితార దూరాన కూచుంది నిద్రరాకుండడంచాత. మధ్యరాత్రి దాటింది. హఠాత్తుగా సితారాకేదో అనుమానం కలిగింది. సుల్తాన్ పరుపువెనకాల యెవరో వున్నట్టనిపించింది. లేచి మెల్లిగా అవేపు నడిచింది. నల్లనాకారం మొహటిఅవుపడ్డది. ఆవ్యక్తి మెరిసిపోయే కత్తితో నిద్ర



పోతోన్న సుల్తాన్ మీద పడుతోన్నాడు. సితార "కెవ్వున" కేకేసి సుల్తాన్ దేహంమీద పడి అతని దేహాన్ని తన దేహంతో కప్పింది. అయినా ఆక్రూరుడి కత్తిదెబ్బ సితార యెడమ చేతికి తగుల్తో సుల్తాన్ కుడి చేతిని బాగా గాయపరిచింది. సుల్తాన్ "హా" అన్నాడు. తక్షణమే బైటినుంచి పదిమంది సైనికులు పరుగెత్తుకొచ్చి ఆదొంగని అక్కడే అంతమొనర్చారు. సుల్తాన్‌కి తగిలినగాయం గొప్పది. స్మృతిలేకుండా పడిపోయాడు. రాచవైద్యుడొచ్చి కట్టుకట్టి సితారానితప్ప అందర్నీ బైటపొమ్మన్నాడు.

రాత్రంతా సితార తనకు తెలీకుండానే సుల్తాన్ పక్కన కూచొని ఘంకా విసిరింది. తెల్లారకట్ల చల్లని గాలి వీచేప్పుడు సుల్తాన్ కదిలాడు. కళ్లువిప్పి దిగులు ముఖంతో పక్కన కూచొనివున్న సితారాని చూసాడు. "సితారా" అన్నాడు. కృతజ్ఞతను వొలికించే ఆవొక్క మాటతో సితారహృదయం నీరైపోయింది. అతనిగండం తప్పిందిగదా అనే సంతోషంకూడా దానికి తోడైంది. తన యెడమచేత్తో ఆమెచేతిని దగ్గిరకి లాక్కొని "ఆనాడు నన్ను చంపడానికి సాహసించినదానివి యీవాళెందుకు రక్షించావ" న్నాడు. ఆమె ఆతనివక్షం మీద తనదేహాన్ని ఆనించి ఆతని పెదిమల్ని ముద్దెట్టుకుంది. తన యెడమచేత్తో ఆమె నట్లానే పట్టుకొని "నాహృదయానికి ప్రేమనేర్పావు సితారా" అన్నాడు.